క్లుప్తంగా

13న ప్రతిభ పురస్కారాల ప్రదానం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పదో తరగతిలో 450, ఇంటర్‌లో 750 మార్కులకుపైగా సాధించిన కుమ్మర శాలివాహన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను ఈ నెల 13న అందజేయనున్నామని కుమ్మర శాలివాహన సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరసయ్య, పెళ్లూరు శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తూరులోని అంబాపురంలో గల కుమ్మర శాలివాహన కల్యాణ మండపంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని చెప్పారు. అర్హులైన విద్యార్థులు తమ మార్కుల లిస్ట్ జెరాక్స్ కాపీ, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను ట్రంక్‌రోడ్డులోని ఆర్కే ఫొటో ప్రింట్ పాయింట్ వద్ద అందజేయాలని కోరారు. వివరాలకు 95730 38716, 94403 09135 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వేణుగోపాలుని ఆలయ ఆధునికీకరణకు చర్యలు

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): మూలాపేటలోని వేణుగోపాలస్వామి ఆలయ ఆధునికీకరణకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచించారు. ఈ మేరకు సంతపేటలోని తన క్యాంప్ కార్యాలయంలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావుతో బుధవారం ఆయన మాట్లాడారు. వేణుగోపాలస్వామి ఆలయ నిధులు, ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని చెప్పారు. తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో అద్దాల మండప పునర్నిర్మాణం, అందులో చారిత్రాత్మక చిత్రాల రూపకల్పన తదితర పనులు చేపట్టేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. నగరంలో రంగనాథస్వామికి ఎంతో విలువైన ఆస్తులున్నాయని, వాటి ఆదాయంపైన దృష్టి సారించాలన్నారు. జిల్లాలోని చాలా ఆలయాలకు విలువైన ఆస్తులు, భూములున్నా.. ధూపదీప నైవేద్యాలకూ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, వీటిపై దృష్టి సారించనున్నామని వెల్లడించారు.

మహిళలకు అండగా సఖి సెంటర్



నెల్లూరు(అర్బన్): లైంగిక వేధింపులు.. 18 ఏళ్లలోపు బాలికలపై జరిగే అరాచకాలను అరికట్టడం.. మహిళలకు అండగా సఖి సెంటర్ నిలుస్తోందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి పేర్కొన్నారు. దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఆవరణలో గల సఖి వన్‌స్టాప్ సెంటర్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని ఆదేశాల మేరకు బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వాణి మాట్లాడారు. మహిళలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారని వివరించారు. గృహ హింసను ఎదుర్కొంటున్న మహిళలకు న్యాయపరంగా అండగా ఉంటామని తెలిపారు. అవసరమైతే న్యాయవాదులను ఉచితంగా ఏర్పాటు చేస్తామన్నారు. సఖి సెంటర్ ఏఓ షెహనాజ్ తదితరులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ జయంతి రేపు

నెల్లూరు(బృందావనం): ఎందరో ఆకలిదప్పికలు తీర్చి అన్నపూర్ణగా పేరుప్రతిష్టలు గడించిన డొక్కా సీతమ్మ జయంతిని శుక్రవారం నిర్వహించనున్నామని కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను సుబేదారుపేటలో బుధవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. సుబేదారుపేటలోని మేరీనాయుడివీధిలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని చెప్పారు. పేదలకు అన్నదానంతో పాటు వస్త్రాల పంపిణీ, విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేయనున్నామని పేర్కొన్నారు. విన్నకోట మహేష్, శేగు రాము, విశ్వేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

'జనహిత - వాత్సల్య'కు విరాళం

నెల్లూరు(బృందావనం): కొండాయపాళెం రోడ్డులోని జనహిత - వాత్సల్య నిరాదరణ బాలల కేంద్రానికి రూ.50 వేల విరాళాన్ని ప్రముఖ కార్డియాలజిస్ట్ శ్రీనివాసరాజు బుధవారం అందజేశారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో తమకు అందజేశారని కేంద్ర నిర్వాహక కార్యదర్శి సాంబశివరావు తెలిపారు. అనంతరం శ్రీనివాసరాజు దంపతులను సత్కరించారు. డాక్టర్ రవి, హరిబాబు, ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్వీ రంగారావు జయంతి

నెల్లూరు(బృందావనం): విశ్వనట చక్రవర్తి ఎస్వీ రంగారావు జయంతిని నగరంలోని నర్తకి సెంటర్‌లో మురళి ఆర్ట్స్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీవీ నటుడు శింగంశెట్టి మురళీమోహన్‌రావు మాట్లాడారు. అనంతరం తబలిస్ట్ లంకా ఆనందరావును సత్కరించారు. తొలుత కేక్‌ను కట్ చేశారు. గాయకుడు పాటూరి శ్రీనివాసులు, కళాకారులు సత్యం, శ్రీనివాసరెడ్డి, అరవ రాయప్ప, జయప్రకాష్, కేతా సుబ్బారావు, అబ్దుల్ మాజిద్, ప్రసాద్, వంశీ, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



విడవలూరు: రామతీర్థంలో కొలువైన కామాక్షితాయి సమేత రామలింగేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడోరోజు బుధవారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో మూలవిరాట్టులకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం కామాక్షితాయి, రామలింగేశ్వరుని ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పల్లకిసేవ జరిపారు. అనంతరం విశేషంగా అలంకరించిన రథంపై ఆది దంపతులను కొలువుదీర్చి గ్రామోత్సవం జరిపారు. రథంపై కొలువుదీరి తమ ఇళ్ల ముంగిటకు వచ్చిన ఆదిదంపతులను భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవం సందర్భంగా పలువురు దాతలు మజ్జిగ, మంచినీటిని అందించి భక్తుల దాహార్తిని తీర్చారు. రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కోవూరు సీఐ సుబ్బారావు, విడవలూరు ఎస్సై రాజా ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. రథోత్సవానికి శంబుని కాపులు, తంబి శ్రీనివాసులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. తహసీల్దార్ శ్రీనివాసులు రథోత్సవంలో పాల్గొన్నారు. ఈఓ రామకృష్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

12 మంది ప్రత్యేకావసరాల పిల్లల గుర్తింపు

- ఎంఈఓ అంకయ్య



రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 అంకయ్య

కొడవలూరు: ప్రత్యేకావసరాల పిల్లల గుర్తింపునకు భవిత కేంద్రం ఐఈఆర్టీల ఆధ్వర్యంలో మండలంలో 40 రోజుల పాటు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ సత్ఫలితాలను ఇచ్చిందని, కొత్తగా 12 మంది పిల్లలను గుర్తించి భవిత కేంద్రంలో చేర్పించడం జరిగిందని ఎంఈఓ-2 ఎన్ అంకయ్య తెలిపారు. స్థానిక భవిత కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఐఈఆర్టీలతో సమావేశమై కేంద్రంలో ఎంత మంది చిన్నారులు విద్యనభ్యసిస్తున్నారు. వారందరికీ ప్రభుత్వ రాయితీలు అందుతున్నాయా..40 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో ఎంత మంది ప్రత్యేకాసరాల పిల్లలను గుర్తించి బడిలో చేర్పించారు..తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇందుకు ఐఈఆర్టీ సునీత బదులిస్తూ ఇప్పటికే భవిత కేంద్రం ద్వారా 120 మంది చిన్నారులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. 40 రోజుల ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి మరో 12 మంది ప్రత్యేకాసరాల పిల్లలను గుర్తించడం జరిగిందన్నారు. కొత్తగా గుర్తించిన వారిని భవిత కేంద్రంలో చేర్పించి విద్యాబుద్ధులు నేర్పడంతో పాటు ప్రభుత్వ రాయితీలు అందించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. అనంతరం అంకయ్య మాట్లాడుతూ మండలంలోని ప్రత్యేకావసరాల పిల్లలందరికీ విద్యాబుద్ధులు నేర్పించాల్సిన బాధ్యత ఐఈఆర్టీలపై ఉందన్నారు. వారి వెంట ఐఈఆర్టీ హైమావతి ఉన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయాధికారులు

ముత్తుకూరు: రైతులు పంటల సాగుకు ముందుగా భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివన్నారాయణ సూచించారు. మండలంలోని పంటపాళెం పంచాయతీలో సాగుచేసిన వేరుశనగ పంటను కేవీకే శాస్త్రవేత్త విజయకుమార్, ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్‌తో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. తామర పురుగు ఉద్ధృతి అధికంగా ఉండడాన్ని గుర్తించి నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణా చర్యలను సూచించారు. అనంతరం భూసార పరీక్షల ప్రయోజనాలు, మట్టి నమూనాలను సేకరించే పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా యజమాన్య పద్ధతులు పాటించి సమస్యాత్మక నేలల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జోత్స్నారాణి, వీఏఏ ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతికి నివాళి



తోటపల్లిగూడూరు: మండలంలోని మండపం పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పోకపూడి ఈశ్వరయ్య అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆయన భౌతిక కాయాన్ని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, నాయకులు టంగుటూరు పద్మనాభరెడ్డి, కాల్తిరెడ్డి సుబ్బారావు, టంగుటూరు సురేష్‌రెడ్డి, మన్నెం చిరంజీవులగౌడ్, దాసరి భాస్కర్‌గౌడ్, సుధీర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడా దుస్తులను పంపిణీ చేస్తున్న దాత

ఇందుకూరుపేట: మండలంలోని నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని క్రీడాకారులకు క్రీడా దుస్తులను బుధవారం పంపిణీ చేశారు. ఇనమడుగు గ్రామానికి చెందిన యరటపల్లి రవీంద్రరెడ్డి తన సొంత నిధులు రూ.25వేలతో క్రీడల్లో రాణిస్తున్న 50 మందికి క్రీడా దుస్తులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీల్లో విద్యార్థులు రాణించి మండలానికి, గ్రామానికి, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీ నాగేశ్వరరావు పీఈటీ ముజీర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్లకు గౌరవ వేతనాన్ని కొనసాగించరూ..



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(బృందావనం): పాస్టర్లకు గౌరవ వేతనాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనసాగించాలని పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డం హనోక్ కోరారు. శెట్టిగుంటరోడ్డులో బుధవారం నిర్వహించిన పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పాస్టర్లకు గౌరవ వేతనాన్ని గత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందజేశారని చెప్పారు. ఇదే తరహాలో ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించాలని కోరారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రాజు, సదాశివరావు, ప్రధాన కార్యదర్శి రమేష్, కార్యనిర్వాహక కార్యదర్శి జాషువా, కోశాధికారి కిషోర్‌కుమార్, సహాయ కార్యదర్శులు శ్యామ్‌ప్రసాద్, సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తి భావంతో జీవించాలి



కోవూరు: సమాజంలోని ప్రతిఒక్కరూ భక్తిభావంతో జీవించాలని పలువురు స్వామిజీలు పేర్కొన్నారు. ఇనమడుగులోని రామకృష్ణానంద ఆశ్రమంలో నిర్వహిస్తున్న శతవర్ష అఖండ నామ యజ్ఞాల్లో భాగంగా హరేరామ హరేకృష్ణ ఇంటర్నేషనల్ స్థాపన దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా యరగాటుపల్లె జోగిరెడ్డి, రాజమ్మ జ్ఞాపకార్థంగా కుమారుడు రంగారెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమాల్లో కమలానందభారతిస్వామి, శ్రీకృష్ణా నందగిరి స్వామి, శ్రీహరితీర్థస్వామి పాల్గొని భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు.

నిర్దేశిత ప్రమాణాలను పాటించాలి



నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో కార్పొరేషన్ సూచించిన పారిశుద్ధ్య ప్రమాణాలను నిర్వాహకులు తప్పక పాటించాలని ఎంహెచ్‌ఓ వెంకటరమణ ఆదేశించారు. మినీబైపాస్‌లోని వెంగమాంబ దాబా, రామలింగాపురంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలల ప్రాంగణాలను బుధవారం తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. దాబా ట్రేడ్‌లైసెన్స్, ఎన్‌ఓసీ సర్టిఫికెట్లను పరిశీలించి మెరుగైన పారిశుద్ధ్య చర్యలను చేపట్టాలని సూచించారు. వంటశాలలో పరిశుభ్రమైన వాతావరణంతో పాటు ఆహారాన్ని శుభ్రంగా ఉంచేలా జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. శ్రీచైతన్య కళాశాలలో తరగతి గదులు, మంచినీటి సదుపాయం, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య నిర్వహణ, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. తాగునీటి వసతిపై కళాశాల యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రాంగణంలోని వాటర్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణకు నగరపాలక సంస్థ నిర్దేశించిన అన్ని ప్రమాణాలను పాటించాలని, లేని పక్షంలో లైసెన్స్‌లను రద్దు చేస్తామని స్పష్టం చేశారు.

డీఐఓగా ఉమామహేశ్వరి

నెల్లూరు(అర్బన్): వైద్యశాఖ జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ (డీఐఓ)గా ఉమామహేశ్వరిని నియమిస్తూ ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. ఈ క్రమంలో సంతపేటలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో ఉత్తర్వులను డీఎంహెచ్‌ఓ పెంచలయ్యకు అందజేసి బాధ్యతలను బుధవారం ఆమె స్వీకరించారు. ఇప్పటి వరకు సెంట్రల్ జైల్లో ప్రధాన డాక్టర్‌గా ఉంటూ ఆమె సేవలందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లాలో పురిటి, చిన్నపిల్లలు, గర్భిణులు, వయోజనులకు టీకాలను సకాలంలో వేసేలా చర్యలు చేపడతామని చెప్పారు. టీకాల విషయమై నూతన వైద్య సిబ్బందికి శిక్షణను నిర్వహిస్తామని వివరించారు.

వస్త్ర సంచుల అందజేత

నెల్లూరు (టౌన్): మద్రాస్ బస్టాండ్ సమీపంలోని ఏసీ కూరగాయల మార్కెట్లో ఇంటర్నేషనల్ యాంటీ ప్లాస్టిక్ ఫ్రీ డే కార్యక్రమాన్ని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి వ్యాపారులు, వినియోగదారులకు జనపనార, వస్త్ర సంచులను అందజేశారు. ప్లాస్టిక్ వినియోగం మానవ జీవితానికి ఎంత హానికరమో తెలియజేశారు. మార్కెట్ అసోసియేషన్ సెక్రటరీ నవీన్, కళాశాల డీన్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్లను సకాలంలో వేయాలి



వ్యాక్సినేషన్ రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ మోనిక

మనుబోలు: చిన్నారులకు వ్యాక్సిన్లను సకాలంలో వేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) నిఘా అధికారిణి డాక్టర్ మోనిక సూచించారు. మండలంలోని మనుబోలు, బద్దెవోలు అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం చేపట్టిన వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాక్సిన్లను ఎక్కడ భద్రపరుస్తున్నారు..వాటికి కాల పరిమితి ఉందా..ప్రభుత్వ నిబంధనలను అనుసరించి పిల్లలకు సకాలంలో వ్యాక్సిన్లు వేస్తున్నారా..తదితర వివరాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సిన్లు వేయించుకున్న చిన్నారులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి మొహిసినా సుల్తానా మాట్లాడుతూ ప్రతి బుధ, శని వారాల్లో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు వారి పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలో వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారని తెలిపారు. వారి వెంట ఏఎన్‌ఎంలు సుభాషిణి, మీరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త నిర్మల ఉన్నారు.

బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండాలి



మానేగుంటపాడులో నేను బడికి పోతా ర్యాలీ

కొడవలూరు: బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని ఎంఈఓ జీ వసంతకుమారి అన్నారు. మండలంలోని మానేగుంటపాడులో ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో నేను బడికి పోతాపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి చిన్నారికి చదువుకునే హక్కు ఉందన్నారు. ఆ హక్కును తల్లిదండ్రులు కాలరాయరాదన్నారు. పిల్లలు చదువుకుంటే మంచి భవిషత్‌ను పొందుతారన్న విషయాన్ని తల్లిదండ్రులు గ్రహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం సకల వసతులు కల్పిస్తున్నందున తల్లిదండ్రులపై ఎలాంటి భారం ఉండదన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. పేద విద్యార్థులు చదువుకుంటేనే ఆ కుటుంబం ఆర్థికంగా బలపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సంపూర్ణమ్మ, ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యం

- కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరు: కోవూరు నియోజకవర్గంలో ప్రజా ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె సందర్శించారు. వసతులను పరిశీలించి పీహెచ్‌సీలో అందిస్తున్న వైద్యసేవలపై రోగులను ఆరాతీశారు. పీహెచ్‌సీలోని సమస్యలను వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పరీక్షలపై ల్యాబ్‌టెక్నీషియన్‌ను ఆరాతీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ కోవూరు మండలంలో 80 వేల మంది జనాభా ఉండగా ఒక్క పీహెచ్‌సీ మాత్రమే ఉందన్నారు.ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రెండో పీహెచ్‌సీ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులకు పేదలే వస్తుంటారని, వారి పట్ల ప్రేమగా వ్యవహరించాలని వైద్యాఆరోగ్య సిబ్బందికి సూచించారు. ప్రజా ఆరోగ్యంపై ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందని, అవి సద్వినియోగమయ్యేలా బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ఇనమడుగు పీహెచ్‌సీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. దేశంలోనే ప్రతిష్ఠాత్మక నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్ గుర్తింపు సాధించిన విడవలూరు మండలం రామతీర్థం పీహెచ్‌సీని ఆదర్శంగా తీసుకుని మిగిలిన పీహెచ్‌సీల సిబ్బంది ఉత్తమ ప్రమాణాలతో వైద్య సేవలు అందించాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులు సైతం తరచూ ఆస్పత్రిని సందర్శించి సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరారు. ఎంపీపీ పార్వతి, ఎంపీటీసీ కొల్లా సునీల్‌రెడ్డి, సర్పంచ్ ప్రమీలమ్మ, పీహెచ్‌సీ వైద్యాధికారి నిరంజన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ



తొట్టెలో నిల్వ ఉన్న నీటిని పరిశీలిస్తున్న హుస్సేనమ్మ

పొదలకూరు: డెంగీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ సూచించారు. పొదలకూరుకు సమీపంలోని లింగంపల్లితోపులో బుధవారం ఆమె పర్యటించారు. వైద్యాఆరోగ్య సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి లార్వా సర్వే చేపట్టారు. దోమలతో వ్యాప్తి చెందే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈడిస్‌ఈజిప్ట్ రకం దోమతో డెంగీ వ్యాధి వ్యాప్తి చెందుతున్నారు. ఈ రకం దోమ వారం రోజుల పాటు నిల్వ ఉన్న మంచి నీటిలో పెరుగుతుందని తెలిపారు. పగటి వేళ మాత్రమే కుడుతుందని తెలిపారు. అందువల్ల ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలకు ఆవాసాలుగా నిలిచే ఇళ్ల పరిసరాల్లో కొబ్బరిబోండాలు, టైర్లు, పనికిరాని రోళ్లు, డబ్బాలు, కూలర్లను తొలగించాలన్నారు. మురుగు నీటిలోని దోమల కారణంగా ఫైలేరియా, మలేరియా, చికున్‌గున్యా వంటి జ్వరాలు వ్యాపిస్తాయన్నారు. అందువల్ల ఇళ్ల పరిసరాల్లో మురుగు నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. వర్షాకాలంలో తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీకావ్య, సబ్‌యూనిట్ అధికారి ఆంజనేయవర్మ, ఆరోగ్యసహాయకులు వెంకటేశ్వర్లు, కామాక్షమ్మ, పెంచలమ్మ, ఆశావర్కర్ అంకమ్మ పాల్గొన్నారు.

అప్రమత్తతే రక్ష

- వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలకు అవకాశం
- విద్యుత్ తీగలకు మరమ్మతులు తప్పనిసరి
- నిర్లక్ష్యంగా ఉంటే ప్రాణానికే ముప్పు
- చిన్నపాటి జాగ్రత్తలతో ప్రమాదాలకు అడ్డుకట్ట

కోవూరు: వర్షా కాలంలో విద్యుత్ ప్రమాదాలు జరిగేందుకు అవకాశాలు ఎక్కువ. రైతులు పొలాల్లో పంటలకు నీరు పెట్టడానికి మోటార్లు వేసే క్రమంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదాలకు గురయ్యే ఆస్కారం ఉంది. మోటార్లు, స్టార్టర్లకు మరమ్మతులు చేపట్టే క్రమంలోనూ ప్రమాదాల బారినపడే అవకాశం ఉంది. పొలాల్లో తెగిపడిన విద్యుత్ తీగలు, కిందకు వేలాడుతున్న వైర్ల వల్ల కూడా ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉంది. ఇళ్ల వద్ద కూడా విద్యుత్ వస్తువుల వినియోగంలో తగిన జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రమాదాలు ఇలా...

వర్షకాలంలో ఈదురుగాలులకు తెగిపడిన విద్యుత్ తీగల వల్ల మనుషులతో పాటు మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. రైతులు మోటార్లు వేసే క్రమంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదాల బారిన పడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనుమతి లేకుండా ఫ్యూజ్‌లను మార్చే క్రమంలో విద్యుదాఘాతానికి గురై పలువురు చనిపోయిన ఘటనలూ ఉన్నాయి. సర్వీస్ వైర్లు, వీధి దీపాలను సరిచేసేందుకు విద్యుత్ స్తంభాలు ఎక్కినప్పుడు విద్యుత్ సరఫరా జరిగి పలువురు మృతి చెందిన సందర్భాలు ఉన్నాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

విద్యుత్ పనులు సొంతంగా చేసుకోరాదు. తడి చేతితో విద్యుత్ పరికరాలు ముట్టుకోకూడదు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజ్‌లు పోతే కరెంటు ఉండదని మరమ్మతులు చేయకూడదు. మోటార్లను, స్టార్టర్లను నేలపై కాకుండా పైన ఏర్పాటు చేయాలి. స్టార్టర్ బోర్డు తడవకుండా చూడాలి. మోటార్ పాడైతే మెకానిక్‌తోనే మరమ్మతులు చేయించాలి. సొంతగా ప్రయత్నించ కూడదు. సర్వీసు, మోటార్ వైర్లను నాణ్యమైనవి వాడాలి. వైర్లకు అతుకులు లేకుండా చూసుకోవాలి. మోటార్ విద్యుత్ వైర్లు ఎక్కడైనా తెగిపోతే పైన ఉండే డెలివరీ పైపును విద్యుత్ సరఫరా జరిగే అవకాశం ఉంటుంది. ఎవరైనా విద్యుత్ షాక్‌కు గురైతే వెంటనే స్విచ్ఛాఫ్ చేసి పొడవైన ప్లాస్టిక్ పైపు, కర్రతో వ్యక్తిని తప్పించాలి. తగిన వైద్య సహాయం అందించాలి.

మూడింటికే పరిహారం

విద్యుత్ సంస్థలు కేవలం మూడు రకాల ప్రమాదాలకు మాత్రమే నష్టపరిహారం అందిస్తాయి. ఆకస్మాత్తుగా విద్యుత్ తీగలు తెగిపడి, తక్కువ ఎత్తులోని విద్యుత్ తీగలు తగిలి విద్యుత్‌షాక్‌కు గురై మనుషులు, పశువులు మరణిస్తే నష్టపరిహారం అందుతుంది. గాయాలకు పరిహారం ఉండదు. మనుషులకు రూ.5 లక్షలు, పశువులకు రూ.40 వేలు, మేకలు, గొర్రెలకు రూ.7 వేల చొప్పున నష్టపరిహారం చెల్లిస్తారు. ఏదైనా ప్రమాదం జరిగిన స్థలంలోని చిత్రం, పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు, శవ పంచనామా పత్రాలను విద్యుత్ అధికారులకు సమర్పించాలి. పశువులకైతే ఫొటోతో పాటు పశువైద్యుడి పోస్టుమార్టం నివేదికను విద్యుత్ అధికారులకు అందించాల్సి ఉంటుంది.

జాగ్రతలు తీసుకోవాలి

ప్రతిఒక్కరూ విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి.పొలాలకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలి. ప్రమాదాల బారిన పడకుండా విద్యుత్ అధికారులు చెబుతున్న జాగ్రత్తలు పాటించాలి. తీగలు తెగిపడినట్లు గుర్తిస్తే వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారఅందించాలి. రైతులు సర్టిఫైడ్ ఎలక్ట్రీషియన్లతోనే విద్యుత్ పనులు చేయించుకోవాలి. ఆన్, ఆఫ్ స్విచ్లు వేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలి.

–చిరమన సతీష్, ఏడీ, కోవూరు